క్లుప్తంగా

కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



కార్పెంటర్స్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణం పరిసర గ్రామాలకు చెందిన అభ్యుదయ కార్పెంటర్స్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై ంది. స్థానిక బైపాస్ రోడ్డులోని సంఘం కార్యాలయ భవనంలో గురువారం సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా తాతోలు రంగాచార్యులు, వడ్లమాని కృష్ణ, కోశాధికారిగా ఆముదాలపల్లి షణ్ముఖచార్యులు, గౌరవాధ్యక్షుడిగా ఆముదాలపల్లి వెంకయ్య, మరొక 30 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ న్యాయసహదారుడు చిట్టూరి పరాలరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం



రాయకుదురులో వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: గ్రామ వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సుపరిపాలన దగ్గర చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని రాయకుదురు సర్పంచ్ గద్దం భారతి తెలిపారు. రాయకుదురు గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద గ్రామ వలంటీర్లకు సత్కార సమావేశంలో పాల్గొని గురువారం ఆమె మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ ఒక వైఎస్సార్ సీపీ మాత్రమే అన్నారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయన్నారు. గ్రామ వలంటీర్లంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ మరింత సేవ భావంతో ముందుకు సాగాలన్నారు. సేవా రత్న ,సేవా మిత్రా అవార్డులు అందుకున్న వలంటీర్లను సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విజయ్, గద్దం భాస్కరరావు, విప్పర్తి రాధాకృష్ణ, బొలిశెట్టి దేవి ప్రసాద్, శ్రవణ్ కుమార్, నారాయణ,మూర్తి, కిషోర్, వృత్తుల నాగేశ్వరరావు, ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

పాలతో పోషకాహారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎండీ జాఫర్

భీమవరం (ప్రకాశంచౌక్): కల్తీ లేకుంటే పాలకు మించిన పోషకాహారం లేదని, కల్తీ జరగకుండా ప్రభుత్వమే నిరంతర పర్యవేక్షణ చేయాలని, చిన్న, పెద్ద డెయిరీలు, సహకార సంఘాలు, నష్టాల బారిన పడకుండా సహకరించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎండీ జాఫర్ అన్నారు. భీమవరం పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ప్రపంచ పాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ, సు. దీర్ బాబు మాట్లాడుతూ పాలు 100 శాతం పోషక విలువలు, విటమిన్ బీ12 అధికంగా కలిగిన ఆహారమని అన్నారు. టీనేజీ ఉన్న పిల్లల్లో, విద్యార్థుల్లో, మానసిక, శారీక ఉత్సాహాన్ని, పెరుగుదలను, ఎముకల పటుత్వాన్ని కలిగిస్తాయని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ డెయిరీల్లో పాలు నిల్వవుండేందుకు అనేక రకాల రసాయనాలు కలుపుతున్నారని, వీటి వల్ల పాలల్లో పోషకాల సంఖ్య తగ్గిపోతోందని, పాల ఉత్పత్తుల్లో ప్రపంచంలో మనదేశం అగ్రభాగాన ఉన్నా వినియోగంలో మాత్రం పూర్తిగా వెనుకబడ్డామన్నారు. కార్యక్రమంలో గంటా సుందర కుమార్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో జోరుగా అభివృద్ధి పనులు

పోడూరు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయని గుమ్మలూరు సర్పంచ్ గొట్టుముక్కల సోనియారమేష్ అన్నారు. గుమ్మలూరు జగనన్న కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను, విద్యుత్‌లైన్‌ను గురువారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కాలనీలో ప్రభుత్వ నిధులు రూ.8లక్షల వ్యయంతో నిర్మించిన మెటల్‌రోడ్డును ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు కొండేటి వెంకటేశ్వరరావు, జుత్తుగ సత్యనారాయణ, కుక్కల నాగేశ్వరరావు, నేలపూడి సురేష్, బొక్కా వెంకటకృష్ణ, పైడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ రైతు భరోసాతో రిలీఫ్

- రైతుల ఖాతాలో సొమ్ము జమ
- అప్పుల కోసం వడుగాపులకు చెల్లుచీటు
- వ్యవసాయాన్ని పండుగ చేస్తున్న ప్రభుత్వం



కోళ్లపర్రు గ్రామంలో రబీ అనంతరం ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉన్న వరి పొలం

ఆకివీడు: నాడు ముంపునకు ముందు–సాగుకు వెనుక అన్న చందంగా ఉండి నియోజకవర్గంలో వ్యవసాయ సాగు ఉండేది. కానీ ప్రస్తుతం సాగుకు ముందే రైతు భరోసా సొమ్ము రైతుల ఖాతాల్లో జమ అవ్వడంతో రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనులకు శ్రీకారం చుడుతున్నారు. గత నాలుగేళ్లుగా విపత్తులను ఎదుర్కొంటూ, ఆర్థిక నష్టాలకు ప్రభుత్వం అన్నదాతకు వెన్ను దన్నుగా నిలవడంతో వరి సాగు మూడు పూలు ఆరు కాయలుగా కొనసాగుతోంది. 20వ శతాబ్దం నుంచి ఖరీఫ్ సాగు అధిక వర్షాలకు, వరదలకు నీట మునుగుతూ రైతులకు తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలుగజేస్తుండేది. గత నాలుగేళ్లుగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో నియోజకవర్గంలోని రైతులు వ్యవసాయాన్ని పండుగ వాతావరణంలో చేస్తున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, రైతు భరోసా, గ్రామాల్లోని 70కి పైగా ఆర్బీకేల ద్వారా రైతులకు పలు సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో రైతులు సమస్యల నుంచి ఉపశమనం(రిలీఫ్) పొందుతున్నారు. నియోజకవర్గంలో సుమారు 12,950 మంది రైతులకు రైతు భరోసా పథకం ద్వారా ఈ ఏడాది మొదట విడతగా రూ.7.12 కోట్ల వారి ఖాతాల్లో జమ చేశారు.

ముందస్తు సాగుకు సన్నాహాలు

నియోజకవర్గంలో ఖరీఫ్ సాగును ఈ ఏడాది ముందస్తుగా చేపట్టేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. సాగుకు పెట్టుబడులు అందడమే కాకుండా, సొసైటీల ద్వారా సకాలంలో రుణ సదుపాయం కల్పిస్తున్నారు. వీటితో పాటు పంట కాల్వలకు జూన్ 2 నుంచి నీటిని విడుదల చేయడంతో త్వరితగతిన నారుమళ్లు వేసుకునేందుకు అవకాశం ఏర్పడిందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

రైతు భరోసా సొమ్ము జమ ఇలా

మండలం	రైతులు	సొమ్ము జమ
ఆకివీడు	2,522	రూ.1.38 కోట్లు
ఉండి	3,842	రూ.2.11 కోట్లు
కాళ్ల	2,339	రూ.1.28 కోట్లు
పాలకోడేరు	4,247	రూ.2.33 కోట్లు
మొత్తం	12,950	రూ.7.12 కోట్లు

ముందస్తు ఖరీఫ్ సాగుకు అవకాశం



ఈ ఏడాది ఖరీఫ్ సాగు ముందుగా చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది. వాతావరణం అనుకూలించడం, కాల్వలకు నీరు, రైతులకు పెట్టుబడులు అందుబాటులోకి రావడంతో సాగుకు సన్నాహాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

కేఎస్ఎస్ శ్రీనివాసరావు, ఏడీఏ, ఆకివీడు

అండగా రైతు భరోసా



రైతు భరోసా పథకం రైతులకు అండగా ఉంది. మా లాంటి చిన్న రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. పెట్టుబడులకు మార్గం దొరికింది. ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవలు బాగున్నాయి. ధాన్యం కొనుగోలు తరువాత వెంటనే సొమ్ము జమ అవుతోంది. జగనన్న ప్రభుత్వ పాలనలో రైతులకు మేలు జరుగుతుంది.

– రాయి సూరన్న, రైతు, పెదకాపవరం

కార్మికుల సంక్షేమ మండలిలో సభ్యులుగా చేరాలి

సాక్షి, భీమవరం: భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు కార్మికుల సంక్షేమ మండలి సభ్యులుగా నమోదు చేసుకోవాలని భీమవరం 2వ సర్కిల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశి శివ నాగమల్లేశ్వరరావు చెప్పారు. గురువారం స్థానిక తాలూకా తాపీ పనివారల సంఘ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల కార్మికులను పనిలోకి అనుమతిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సహజ, ప్రమాద మరణానికి వైఎస్సార్ బీమా ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఏలూరు పంపుతామన్నారు. ఈశ్రమ్ కార్డులను శ్రామికులంతా కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు వంక వీరాస్వామి, మెల్ల సత్యనారాయణ, చిన్నంశెట్టి నాగేశ్వరరావు, మేడిద వెంకటరమణ, బత్తిన నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అనాకోడేరులో సచివాలయం ప్రారంభం

భీమవరం అర్బన్: మండలంలో అనాకోడేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిరుమాని ఏడుకొండలు గురువారం విలేకరులకు తెలిపారు. ఉదయం 9.30కు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

కాళ్ల: ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. కాళ్ల మండలం జువ్వలపాలెంలో గ్రామంలో ఉన్న శ్రీ పైడితల్లి అమ్మవార్ల నూతన ఆలయ నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి భూమి పూజలు వేద మంత్రాల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో గ్రామమంతా సుభిక్షంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. గ్రామంలో నిత్య పూజలు అందుకుంటూ ప్రజలను ఆశీర్వదించాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రుద్రరాజు వెంకట రామకృష్ణంరాజు, కటారి లక్ష్మీపతి రాజు, ముదుండి సురేష్, ఎంపీటీసీ సభ్యులు మీసాల శ్రీనివాస్, గుర్రం బెనహర్, బొచ్చ గణేష్, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, వేగేశ్న విజయ రామారాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేన జిల్లా అధ్యక్షుడు గోవిందరావు అరెస్టు

సాక్షి, భీమవరం: భీమవరంలో ప్రజాశాంతికి భంగం కలిగించేలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించడంతో ఏర్పడిన వివాదంలో జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావును ముందస్తుగా గురువారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం .వెంకటేశ్వరరావు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో జనసేన ఆధ్వర్యంలో ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. వీటిని తొలగించడంతో గోవిందరావు ఇంటి వద్ద పార్టీ శ్రేణులను సమీకరించే ప్రయత్నాలు చేయడంతో ముందస్తుగా గోవిందరావును అరెస్టు చేశారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



భీమవరం శాఖా గ్రంథాలయంలో మోక్షితను అభినందిస్తున్న దృశ్యం



యండగండి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో మెహందీపై శిక్షణనిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం,యోగ, మ్యూజికల్ చైర్స్ వంటివి నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన పట్టణానికి చెందిన విద్యార్థి కొరశిక మోక్షితతో మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. మోక్షిత మాట్లాడుతూ తాను మూడేళ్ల వయస్సు నుంచి స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతన్నానని రాజకోట్, త్రివేంద్రం, తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రశంస పత్రాలు, బహుమతులు అందుకున్నట్లు చెప్పింది. అలాగే 2023లో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించింది. అనంతరం మోక్షితను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు, చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, కలిగొట్ల గోపాలశర్మ, రామ నాగేశ్వరరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరంలో మెహందీ శిక్షణ

ఉండి: మండలంలోని యండగండి గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం మెహిందీ డిజైన్లపై విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. భీమడోలుకు చెందిన బ్యూటీషియన్ పి.నందిని వివిధ రకాల మెహందీ డిజైన్ల వేసే విధానాన్ని విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యరాజ్, గ్రంథాలయ అధికారి ఎస్‌సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.


ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

వీరవాసరం: సమస్యకు పరిష్కారం లభించే వరకు పర్యవేక్షణ అవసరమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం వీరవాసరం తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై, జగనన్న కాలనీలో ఇండ్ల నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు, రెండవ దశ రీసర్వే పనులు, సంబంధిత అధికారులతో శాఖలు వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ ఎట్టి పరిస్థితుల్లో స్పందన కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదులు పరిష్కారమయ్యేటట్లు చూడాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పూర్తి పరిష్కారాన్ని చూపాలన్నారు. పరిష్కారం పంపిన అనంతరం ఫిర్యాదు దారుడుతో మాట్లాడి అభిప్రాయాన్ని స్వయంగా తెలుసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఫిర్యాదు తిరిగి ఓపెన్ అవ్వడానికి వీల్లేదన్నారు. కింది స్థాయి ఉద్యోగులకు ఫిర్యాదులను అప్పగించడం వల్ల సమస్య పూర్తిగా పరిష్కారం కాకపోవడంతో పాటు రీఓపెన్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఫిర్యాదును ప్రతి ఒక్క అధికారి క్షుణ్ణంగా చదివిన తర్వాతే పరిష్కారాన్ని అందజేయాలన్నారు. మన దగ్గరే సమస్య పరిష్కారమైతే అర్జీదారుడు ఎట్టి పరిస్థితుల్లో తదుపరి చర్యలకు వెళ్లరని నిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ దాసి రాజు, గృహ నిర్మాణ శాఖ ఈఏ బి.వెంకట రమణ, తహసీల్దారు ఎం.సుందర రాజు, ఎంపీడీఓ ఎస్.ఉమామహేశ్వర రావు, వ్యవసాయ శాఖ ఏఓ గీతా దేవి తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి చిన్నమావుళ్లమ్మ జాతర మహోత్సవాలు



జాతర వివరాలు తెలియజేస్తున్న అమ్మవారి మందిర సేవా సమితి సభ్యులు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో 36వ వార్డు రామారావుపేటతోటలో ఉన్న శ్రీశ్రీ చిన్న మావుళ్లమ్మ అమ్మవారి 38వ వార్షిక జాతర మహోత్సవాలు ఈ నెల 4వ తేదీనుంచి నిర్వహిస్తున్నట్లు అమ్మవారి సేవా సమితి అధ్యక్షులు రామాయణం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి రేవూరి గోగిరాజు తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 4న అమ్మవారి జాతరను స్థానిక గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. 4 నుంచి 11 వరకు ప్రతీ రోజు అమ్మవారి ఆలయం వద్ద జాతర మహోత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కళాప్రదర్శనలు ఉంటాయన్నారు. 11న భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శులు కోరసిక వెంకటేశ్వరరావు, కొండేపూడి గణపతి పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలను పరిష్కరించాలి

మొగల్తూరు: వెలుగు వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ జి.అనితా కుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వీఓఏల మూడు సంవత్సరాల కాలపరిమితిని రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు హెచ్ఎం బి.శ్రీనివాసం, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నెల్లి సతీష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలోతెలిపారు. గత ఏడాది ఏర్పాటు చేసిన కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో చేరికకు అవకాశం కల్పించారని తెలిపారు. 20 సంవత్సరాల అనుభవం కలిగిన అధ్యాపకులతో విద్యా బోధన ఉంటుందన్నారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అమ్మ ఒడి, ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, బస్ పాస్, వారాంతపు పరీక్షలు, మధ్యాహ్న భోజనం, సైన్సు ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, అధునాతన లైబ్రరీ అందుబాటులో ఉన్నాయని వారు వివరించారు. జూలై 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

అమ్మవార్లకు అఖండ అన్నాభిషేకం



ప్రత్యేకాలంకరణలో గంగానమ్మ, మద్దిరమ్మ

ఆకివీడు: స్థానిక మాదివాడలోని గంగానమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్ల వార్షిక జాతర మహోత్సవం సందర్భంగా బుధవారం అమ్మవార్లకు అఖండ అన్నాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్లు మోటుపల్లి కుమారి, నిమ్మల నాగు, తిరుమారెడ్డి మాధవి, దొడ్డి జగదీష్, గేదల అప్పారావు, మన్నే లలితాదేవి, కిమిడి అరుణ కుమారి, గోపిశెట్టి సత్యవతి, మోపిదేవి సత్యవతి, బత్తుల శ్యామల తదితరులు పాల్గొన్నారు. బండారు, తోట వంశస్తుల ఆడపడుచులైన అమ్మవార్లకు పానకాలు, సారి కావిడులను ఊరేగింపుగా తీసుకువచ్చారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌కు అనూహ్య స్పందన



రాజుగారితోట గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహిస్తున్న వైద్యులు

నరసాపురం రూరల్: పేదల వైద్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది. ప్రతీ పేద రోగికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే చాలా మేరకు ఆసుపత్రులను, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను, హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు. వీటికితోడు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతీరోజూ వైద్యులు ఆయా గ్రామాల్లోని హెల్త్ క్లినిక్‌లకు, రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. అవసరమైన మందులు ఇవ్వడం, వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. రోగికి తగు సూచనలు, సలహాలను ఇస్తూ సీఎం జగన్ ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్యసిబ్బంది ధైర్యం చెబుతున్నారు. తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజుగారితోట గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఎ.చిరంజీవి రోగులను పరీక్షించి అవసరమైనవారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 182 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వీ మంగతాయారు, హెల్త్ అసిస్టెంట్ చింతపల్లి రవి, సీహెచ్ఓ వైదుర్య పాల్గొన్నారు.